క్లుప్తంగా

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

కారేపల్లి: ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పాటుపడతానని వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ తెలిపారు. మండలంలోని వెంకిట్యాతండాలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బానోతు భాస్కర్ నాయక్ సంతాప సభ గురువారం జరగగా ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా భాస్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్లు దుగ్గినేని శ్రీనివాసరావు, ధరావత్ మంగీలాల్, నాయకులు ముత్యాల సత్యనారాయణ, అడప పుల్లారావు, అజ్మీరా వీరన్న, వాంకుడోతు నరేష్, భగవన్‌లాల్, జాల సాంబ, బత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు 27నుంచి కౌన్సెలింగ్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరగోరు విద్యార్థినులకు ఈ నెల 27 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రజిత తెలిపారు. బీబీఏ, బీఏ, బీకామ్ జనరల్, బీకామ్ కంప్యూటర్స్, బీఎస్సీ (ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌డీఎస్), బీఎస్సీ లైఫ్ సైన్స్ (బీజెడ్‌సీ, బీజెడ్‌సీఎస్, ఎంబీజెడ్‌సీ) కోర్సుల్లో చేరేందుకు ఇంటర్‌లో 40శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన బాలికలు అన్ని ధ్రువపత్రాలతో కళాశాలకు వచ్చి కౌన్సెలింగ్‌లో పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు 94910 63083, 96409 47467 నంబర్లను సంప్రదించాలని ఆమె సూచించారు.

టీబీ వ్యాధిపై అవగాహన

కల్లూరు: కల్లూరు పీహెచ్‌సీ పరిధి కాకతీయ షుగర్ ఫ్యాక్టరీలో గురువారం టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ నోడల్ అధికారి గుండపనేని రామారావు, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ వై.సురేష్‌లు పాల్గొని మాట్లాడుతూ.. కర్మాగారాల్లో పని చేసే కార్మికులు తప్పకుండా టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, దీనిపై ప్రతి క్కొరికీ అవగాహనక కల్గిఉండాలని పేర్కొంటూ టీబీ వ్యాధి లక్షణాలను వివరించారు. టీబీ అంటువ్యాధి కాదని, దీనికి పరీక్షలు, మందులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

టార్పాలిన్ పట్టాలు పంపిణీ

సత్తుపల్లిరూరల్: సింగరేణి ప్రభావిత గ్రామమైన సత్తుపల్లి మండలం కిష్టారం బీసీ కాలనీ వాసులకు సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు కొత్తగూడెం జనరల్ మేనేజర్ షాలెం రాజు ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీసీ కాలనీ నివాసితులకు టార్పాలిన్ పట్టాలు అందించారు. వీటిని కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ చేతుల మీదుగా కాలనీ వాసులకు అందించారు. కార్యక్రమంలో సింగరేణి కిష్టారం ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవీ నరసింహారావు, గ్రామస్తులు అప్పారావు, అప్పారావు, రవి, ఈశ్వర్, గ్రామ కార్యదర్శి వెంకటరమణ, స్పెషలాఫీసర్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సహకారమేది..?

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల అవస్థలు

- నీటి, విద్యుత్ కనెక్షన్ల కోసం తిప్పలు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఫలితం లేక నిరాశ



సత్తుపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

సత్తుపల్లిరూరల్: ఎన్నో సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పేదోడి సొంతింటి కలను నిజం చేసేందుకు ఇళ్ల స్థలాలు ఉన్న లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. కానీ ఇంటి నిర్మాణానికి కావాల్సిన నీటి సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పేదోడికి సాకారం అందించాల్సిన అధికారులు రూల్స్ మేము తప్పలేమంటూ చెప్పడంతో ఇళ్లు ఎలా నిర్మించుకోవాలోనని సదిగ్ధంలో పడాల్సి వస్తోంది.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు..

అత్యంత నిరుపేద కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు నీటి కనెక్షన్ ఏర్పాటు చేయాలంటే ఇంటి నంబర్ కావాలని, ఇంటి నిర్మాణం తర్వాతనే నంబర్ కేటాయించి కనెక్షన్ ఇస్తామని చెప్పటంతో ఇంటి నిర్మాణం ఎలా పూర్తి చేసుకోవాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

విద్యుత్ మీటర్ కోసం..

ఇంటికి విద్యుత్ మీటర్ మంజూరు కావాలంటే మీ వీధిలో ఇంటికి 30మీటర్ల దూరంలోనే విద్యుత్ ఉండాలనే నిబంధనలు పెట్టడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇకవేళ ఇంటిసమీపంలో స్తంభం లేకపోతే లబ్ధిదారులే స్తంభాల ఏర్పాటుకు ఖర్చులు భరించాలని అధికారులు తెలుపుతున్నారు. దీంతో రూ.30వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని, అసలే ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తే దానిలో మీటర్ ఏర్పాటుకే వేల రూపాయలు ఖర్చు అవుతుంటే.. ఇంకా ఇళ్లు ఏ విధంగా పూర్తిచేయాలోనని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే రాగమయి స్పందించి సమస్యలను అధికారుతో చర్చించి ఇందిరమ్మ ఇళ్లకు మీటర్, నీటి కనెక్షన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటి నంబర్ లేకపోవడంతో..



ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. ఇల్లు నిర్మించుకోవాలంటే నీళ్లు, విద్యుత్ అవసరం. ఇంటి నంబర్ లేదని అధికారులు నీటి కనెక్షన్, విద్యుత్ మీటర్ ఇవ్వటం లేదు. చాలా ఇబ్బందిగా ఉంది. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రంతో నీటి, విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయించాలని కోరుతున్నాం.

– ఎ.భవాని, ఎన్టీఆర్‌నగర్

ఇబ్బంది పడుతున్నాం..



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి నీళ్లు లేకపోవటం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడాల్సిన వస్తోంది. నీటి పంపు కనెక్షన్ ఇవ్వాలంటే ఇంటి నంబర్ ఉండాలని, ఇంటి నిర్మాణం పూర్తి అయిన తర్వాతనే నంబర్ ఇవ్వాల్సి ఉంటుందని అధికారులంటున్నారు. దీంతో నీటి కనెక్షన్ వచ్చే పరిస్థితి లేదు. విద్యుత్ మీటర్‌కు దరఖాస్తు చేసుకున్నాం.

– గోపాలకృష్ణ, సత్తుపల్లి

సెంట్రల్ లైటింగ్, డివైడర్లు ఆధునీకరించాలి



కమిషనర్‌కు సూచనలు చేస్తున్న మంత్రి తుమ్మల

కల్లూరు: కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారిపై డివైడర్ల ఎత్తు పెంచడమే కాక సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేసి మధ్యలో పూలమొక్కలు నాటాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. అంతేకాక పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను ఆధునికీకరించాలని తెలిపారు. కల్లూరులో గురువారం పర్యటించిన ఆయన అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌కు సూచనలు చేశారు. ఇటీవల మంజూరైన రూ.15 కోట్ల నిధులతో చేపట్టనున్న పనుల ప్రణాళికలను కమిషనర్ వివరించగా మంత్రి మాట్లాడారు. పారిశుద్యాన్ని మెరుగుపర్చడమే కాక ఇతర పనులపై దృష్టి సారించాలని తెలిపారు. సెంట్రల్ లైటింగ్, డివైడర్ల నిర్మాణానికి రూ.1.50 కోట్లు, జాతీయ రహదారి వెంట డ్రెయినేజీల నిర్మాణానికి రూ.కోటి, రహదారుల అభివృద్ధి, పరిసరాల పరిశుభ్రతకు కార్యాచరణ రూపొందించినట్లు కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో వైద్యశిబిరం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఖమ్మం మ్యాక్స్‌వెల్ కంటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెటాలియన్ కమాండెంట్ ఎస్.పెదబాబు హాజరై ప్రారంభించారు. కంటి వైద్యశిబిరంలో బెటాలియన్ సిబ్బంది, అధికారులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు దళాధిపతి ఏ.అంజయ్య, సహాయ దళాధిపతులు ఎస్‌డి రంగారెడ్డి, ఎస్.శ్రీధర్‌రాజ, వైద్య నిపుణులు డాక్టర్ దేవేందర్, టెక్నీషియన్ పాషా, కౌన్సిలర్ శ్రీనివాస్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉన్నత స్థాయికి ఎదగాలి

తల్లాడ: విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఖమ్మం జీసీడీఓ టి.తులసీ అన్నారు. తల్లాడ మండలం కుర్నవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జెండర్ ఈక్విటీ, మహిళా రోల్ మోడల్స్‌తో బాలికల చర్చా కార్యక్రమం నిర్వహించారు. రోల్ మోడల్స్‌గా హాజరైన పూర్వ విద్యార్థులు బత్తుల రమ, టీజీఆర్ఎస్ వైరా ప్రిన్సిపల్ ఎస్.కె.షాహిదా గౌరీ, ఉపాధ్యాయురాలు ఉషశ్రీ, శాస్త్ర ఇంజనీరింగ్‌కళాశాల విద్యార్థులు హాజరు కాగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో తల్లాడ ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, కుర్నవల్లి పాఠశాల హెచ్ఎం ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి లక్ష్మణ్‌ను కలిసిన ఎమ్మెల్యే

సత్తుపల్లి: ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి గురువారం సెక్రటరీయేట్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

ఎంపీ నిధులతో బోరు ఏర్పాటు



చైతన్యనగర్‌లో బోరు వేస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని ముగ్గు వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల చైతన్యనగర్‌లో నీటి సమస్య నెలకొంది. సమస్యను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. తన నిధుల నుండి బోరు మంజూరు చేయగా గురువారం చైతన్యనగర్‌లో ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు ఎంపీ రఘురామిరెడ్డి, రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బోనకల్: గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బోనకల్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులంలో శాస్త్రీయతతో కూడిన టైం టేబుల్‌ను ప్రకటించాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, గ్రేడ్2 ప్రిన్సిపాళ్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని, కేర్ టేకర్స్‌ను నియమించి విద్యార్థులకనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కె.లక్ష్మణ్‌రావు, యోహాన్, చిన్నరంగారావు, గోపాల్‌రావు, నరసింహారావు, నరేంద్రసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని శ్రీసాయిబాబా ఆలయాల్లో గురువారం స్వామివారికి అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. భక్తులు సాయిబాబాను దర్శించుకుని, శ్రీసాయి స్మరణ చేస్తూ గీతాలను ఆలపించారు. భక్తులకు ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మధిర: ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తి ఎన్.ప్రశాంతి, తదితరులు



వైరా: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్, ఎక్సైజ్ అధికారులు

మత్తుతో జీవితం చిత్తు..

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

వైరా/కొణిజర్ల/కారేపల్లి: మాదక ద్రవ్యాలతో జీవితం చిత్తుగా అవుతుందని, వీటికి దూరంగా ఉండాలని వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్ అన్నారు. గురువారం వైరాలో పోలీస్, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక జూనియర్ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన బాల బాలికలకు ఏసీపీ డిక్షనరీలను అందించారు. అదే విధంగా కొణిజర్లలో ర్యాలీ నిర్వహించి, అనంతరం స్థానిక జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎస్సై గుగులోత్ సూరజ్ పాల్గొని మాట్లాడారు. కారేపల్లిలో ఎస్సై బి.గోపి ఆధ్వర్యంలో.. కారేపల్లి కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయం, కారేపల్లి హైస్కూల్ విద్యార్థులు కారేపల్లి బస్టాండ్ సెంటర్ నుంచి సినిమాహాల్ వరకు ర్యాలీ చేసి, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై పి.రామారావు, ఎక్సైజ్ శాఖ ఎస్సై వసంతలక్ష్మి, ట్రెయినీ ఎస్సై కిరణ్, కస్తూర్బా ఎస్ఓ ఝాన్సీసౌజన్య, కళాశాల, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

● సత్తుపల్లి/తల్లాడ: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో.. మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.గోపి పాల్గొని మాట్లాడారు. తల్లాడ మండల కేంద్రంలో ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించి విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కన్వీనర్ వై.మహేష్, ఎం.బాలకృష్ణ, మాదవి, రవికుమార్, పీర్ సాహెబ్, బాలభారతి విద్యాలయం కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, కేఎస్ఎం ప్రిన్సిపాల్ టి.రామారావు, డాక్టర్ విజయ్, హెల్త్ సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, ఝాన్సీలక్ష్మి, రాజశ్రీ, అన్నపూర్ణ, అరుణిమ, సుజాత, ఆశ కార్యకర్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● మధిర/బోనకల్: మధిర మండల కేంద్రంలోని నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి ఎన్.ప్రశాంతి, బోనకల్ మండల కేంద్రంలో ఎస్సై పొదిలి వెంకన్న ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సత్తుపల్లి: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎన్.గోపి

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి



వైరా: మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వేణు

వైరా/తల్లాడ: వర్షాకాలంలో జరిగే విపత్తుల పట్ల అధికార యంత్రాగం అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం వైరా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో, తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు ఎవరూ సెలవుల్లో ఉండకుండా సరైన సహాయ సహకారాలు అందించాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో ఎదురౌతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, ఈఓ కృష్ణారావు, ఆర్ఐలు భాస్కర్, ఖాజా మొయినుద్దీన్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఏర్పాటుతో పదవులు రద్దు!

● ప్రత్యామ్నాయాలపై ఆశావహుల దృష్టి

కల్లూరురూరల్: మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న కల్లూరు ఇటీవల మున్సిపాలిటీగా ఏర్పాటైంది. దీంతో ఎంపీటీసీ, వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ తదితర పదవులు రద్దయ్యాయి. కల్లూరు మేజర్ గ్రాపంచాయతీతో పాటు ఏడు గ్రామపంచాయతీలను విలీనం చేస్తూ మున్సిపాలిటీ ఏర్పాటుచేసిన విషయం విదితమే. ఈ జాబితాలో కప్పలబంధం, పుల్లయ్యబంజరు, తూర్పులోకవరం, పడమర లోకవరం, కిష్టయ్యబంజరు, హనుమతాండ, వాచ్యనాయక్‌తండా గ్రామాలు ఉన్నాయి. ఫలితంగా కల్లూరు మేజర్ జీపీ పరిధిలో 18వార్డులు, కప్పలబంధంలో పది వార్డులు, తూర్పులోకవరంలో ఐదు, పుల్లయ్యబంజరు, పడమరలోకవరం, హనుమతండా, కిష్టయ్యబంజరు, వాత్యానాయక్‌తండాలో ఎనిమిదేసి వార్డులతో పాటు సర్పంచ్ ఎన్నికలకు మంగళం పాడినట్లయింది. దీంతో ఈ పదవులపై ఆశలు పెట్టుకున్న రాజకీయ పార్టీల నాయకులు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించారు. ఇవేకాక ఐదు ఎంపీటీసీ స్థానాలు, జెడ్పీటీసీ స్థానం కూడా రద్దయింది. కల్లూరు మున్సిపాలిటీని 20 వార్డులుగా విభజించిన నేపథ్యాన పాత ఎనిమిది గ్రామ పంచాయతీల పరిధి నుంచి ఆశావహులు ఈ స్థానాల్లో పోటీ పడాల్సి ఉంటుంది.

విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు వితరణ

వేంసూరు: భగవన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతోత్సవాల సందర్భంగా వేంసూరులోని మూడు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పలకలు, నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్స్, బలపాలు, ఆట వస్తువులు వితరణగా చేశారు. వాటిని గురువారం ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థ కన్వీనర్ సీహెచ్ కల్యాణ్‌శర్మ, సభ్యులు శ్రీనివాసరావు, మధుసూదన్‌రావు, కుమారస్వామి, సత్యనారాయణ, అనూప్ పాల్గొన్నారు.

కేవైఏ ఖమ్మం యూత్ ఆధ్వర్యంలో..



ఎర్రబోడు పాఠశాలలో బ్యాగులు అందిస్తున్న దృశ్యం

కారేపల్లి: కేవైఏ ఖమ్మం యూత్ అసోసియేషన్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో.. మండలంలోని ఎర్రబోడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్కూల్ కిట్లు, వాటర్ బాటిళ్ల వితరణ చేయగా, మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ హెచ్ఎస్ కోమట్లగూడెం, ఎర్రబోడు హెచ్ఎంలు శారద, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

సత్తుపల్లి: కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు కోరారు. గురువరం సమ్మె నోటీసును సత్తుపల్లి ఐసీడీఎస్ సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్స్ కోడ్స్‌ను రద్దు చేయాలని, లేకపోతే కార్మిక సంఘాలు బానిసలుగా బ్రతకాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు మరియమ్మ, శ్రీలక్ష్మి, షకీన, నాగేంద్ర, విజయలక్ష్మి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

హైదరాబాద్ ధర్నాను..

వేంసూరు: స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు, యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ.. ఈ నెల 30న హైదరాబాద్ ఇందిర పార్క్ వద్ద జరిగే ధర్నను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర యాదవ హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు సూనె హరిబాబు కోరారు. కురుమ, యాదవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆదర్శ కమ్యూనిస్టు ప్రభాకర్



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

చింతకాని: చివరి శ్వాస వరకు ఎర్రజెండా చేతపట్టి ఆదర్శ కమ్యూనిస్టుగా ప్రభాకర్ నిలిచాడని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని నేరడలో నిర్వహించిన సీపీఐ మండల సీనియర్ నాయకుడు పెరిక ప్రభాకర్ సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభాకర్ మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం స్మారక స్తూపాన్ని ఆవిష్కరించి ప్రభాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జితేందర్‌రెడ్డి, గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

వైరా: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రాన్ని.. గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు గురువారం పరామర్శించారు. వైరా మాజీ ఎంపీఐ టీస్టా రాష్ట్ర అధ్యక్షుడు బాదావత్ శంకర్‌నాయక్, ఇరిగేషన్ డీఈ తేజావత్ వెంకట్రామ్ నాయక్, ఎక్సైజ్ అధికారి హెచ్‌బీ నాయక్, ట్రైబల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఎం ఎల్ రాములు నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా భిక్షపతి రాథోడ్ వైరాలోని సుందరయ్యనగర్‌లోని ఇంటిలో వీరభద్రాన్ని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఎర్రజెండాతోనే పేదలకు న్యాయం



మాట్లాడుతున్న సుదర్శన్

ఎర్రుపాలెం: పేదలకు న్యాయం జరగాలంటే అది ఎర్రజెండాతోనే సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. గురువారం మండలంలోని మామునూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన రామాల మోక్షానందం దశదిన కర్మకు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ.. మోక్షానందం సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, గోపాలరావు, కోటేశ్వరరావు, వీరయ్య తదితరులున్నారు.

పాలేరుకు అనుసంధానం చేయాలి



సీతారామ లింక్ కెనాల్‌ను పరిశీలిస్తున్న నాయకులు

ఏన్కూరు: సీతారామ ప్రాజెక్ట్‌ను సత్వరమే పూర్తిచేసి పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వ, రాజీవ్ లింక్‌కెనాల్, తిమ్మరావు పేట హెడ్ రెగ్యులేటర్, వైరా రిజర్వాయర్ ఎస్కేప్ ఛానల్ లను పరిశీలించారు. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్ కోసం ఏన్కూరు, కారేపల్లి మండలాల్లో భూసేకరణ చేసి నేటికీ పరిహారం ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కృష్ణ, మీరా, చలపతిరావు, గంగాధర్, నాగేశ్వరరావు, లక్ష్మా, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ముదిగొండ/కల్లూరు: విద్యుత్ వినియోగదారులు, రైతులు విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని విద్యుత్ శాఖాధికారులు పేర్కొన్నారు. గురువారం వివిధ గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ నేపథ్యాన ముదిగొండ మండలం మేడేపల్లి, యడవల్లి, గోకినేపల్లి గ్రామాల్లో ఖమ్మం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఏఈ శ్రీనివాసరావు, కల్లూరులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఏఈ పి.వెంకట్ మాట్లాడారు. అవగాహన లేకుండా విద్యుత్‌కు సంబంధించిన పనులు చేయొద్దని, పొలాల్లో కిందకు వేలాడే వైర్లు, కంటికి కనిపించని వైర్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే ఇళ్లలో ఇనుప తీగలపై బట్టలు ఆరవేయొద్దని తెలిపారు. ఏమైనా ప్రమాదకర పరిస్థితుల్లో విద్యుత్ టోల్‌ఫ్రీ నంబర్ 1912 ద్వారా తెలియజేయాలని కోరారు. అలాగే కల్లూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఫోన్ నంబర్ 87124 83733, బత్తులపల్లి సబ్‌స్టేషన్ ఫోన్ నంబర్ 87124 83852లను సంప్రదించాలన్నారు.



ముదిగొండ: మేడేపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏఈ శ్రీనివాసరావు

క్రీడా ప్రాంగణాలు.. బోర్డులకే పరిమితం

వేంసూరు: మండలంలోని మొత్తం 26 గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. వేంసూరు మండలంలోని కల్లూరుగూడెంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం కేవలం బోర్డులకే పరిమితమైంది. ప్రాంగణంలో తుప్పు పట్టిన ఇనుప కడ్డీలు, పిచ్చి మొక్కలు, చెత్త చెదారంతో నిండి ఉంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టి సారించి నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణాలను వినియోగంలో తెచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంతా క్రీడాకారులు కోరుతున్నారు.



కల్లూరుగూడెంలోని క్రీడా ప్రాంగణం